క్లుప్తంగా

కండలేరులో 8.710 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 8.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దళితుల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు


వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

సైదాపురం : మండలంలోని జోగిపల్లిలో దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య కోరారు. ఆయన సోమవారం కాలనీ వాసులతో కలిసి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై సమగ్రంగా విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(బైపీసీ)లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్‌కే షాహినాభాను తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బడిబయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ వర్గాలకు చెందిన బాలికలు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.

గేట్‌లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట : విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మెకానికల్ విభాగం విద్యార్థులు కురవ అశోక్‌కుమార్ 484, షేక్ అర్షద్ 6425 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వారిని డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దక్కిలి: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. ఆమె సోమవారం సంగనపల్లి, మార్లగుంట, వెలికల్లు, మాధవయ్యపాళెం, దేవులపల్లి, డీ వడ్డిపల్లి, వెంబులూరు, లింగసముద్రం గ్రామాల్లో ఉన్న సచివాలయాలు, పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అనుమతి లేని హోర్డింగ్స్, బోర్డులు, పోస్టర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. అనంతరం పలుచోట్ల అనుమతి లేని ఫ్లెక్సీలు, బోర్డులను తొలగింపజేశారు.

పోస్టర్ల తొలగింపు


డీవీ సత్రంలోని అండర్‌పాస్ బ్రిడ్జి గోడపై పోస్టర్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

దొరవారిసత్రం : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పోస్టర్లను రెవెన్యూ సిబ్బంది తొలగిస్తున్నారు. ఇప్పటికే డీవీ సత్రంలో రోడ్డు వెంబడి గోడలపై ఉన్న పలు పార్టీలకు చెందిన పోస్టర్లను తొలిగించారు. కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ఉన్న పథకాలు వివరాలు కనిపించకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు.

జనావాసాల్లోకి జింక


చెందోడు గ్రామంలో ఉన్న జింక

కోట : మండలంలోని చెందోడు గ్రామంలోకి సోమవారం సాయంత్రం ఒక జింక వచ్చింది. దానిపై కుక్కలు దాడికి దిగడంతో స్థానికులు రక్షించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

జగనన్నను సీఎంను చేసుకుందాం

- కరోనాలోనూ పేదలను ఆదుకున్న ప్రభుత్వం
- సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలతో ఇంటి వద్దకే సేవలు
- వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం


మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రులుగా పనిచేశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ల వ్యవ స్థలను ఏర్పాటుచేసి పరిపాలనను ప్రజల ఇళ్ల వద్దకు తీసుకువచ్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అలాంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండా లని పిలుపునిచ్చారు. వెంకటగిరిలోనే నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం మంత్రి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డికి నేదురుమల్లి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతంపలికారు. ఇందులో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014 ఎన్నికల్లో ప్రజలను మోసం చేయలేక రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వలేదని గుర్తు చేశారు. హామీ ఇచ్చి ఉంటే ఆనాడే సీఎం అయ్యేవారని వివరించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. కరోనా వల్ల రెండు సంవత్సరాలు లాక్‌డౌన్ ప్రకటించినా పేదలకు సంక్షేమ పథకాలు నిలపకుండా అందజేశారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి విద్య, వైద్యం అందించడానికి అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. 2014లో అబద్ధపు హామీలు గుప్పించి బీజేపీ, జనసేన పొత్తుతో అధికారం చేపట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకున్నారని తెలిపారు. నేడు మళ్లీ మోసం చేసేందుకు బీజేపీ, జనసేనతో కలిసి ముందుకు వస్తున్నారని వివరించారు. చేసిన మంచిని గుర్తు పెట్టుకుని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సమష్టి కృషితోనే విజయం

కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితోనే వైఎస్సార్ సీపీ విజయదుందుబి మోగిస్తుందని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడు తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నా రు. వారు పొందిన లబ్ధిని వివరించి ఫ్యాను గుర్తు కు ఓటు వేసి తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా తనను, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వ దించి గెలిపించాలని కోరారు. మాజీ జెడ్పీ చైర్మన్, పరిశీలకులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోట అని తెలిపారు. ప్రతి ఒక్కరూ గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీని ఆదరించేలా చూడాలన్నారు. ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. జోనల్ జేసీఎస్ కన్వీనర్ శివశంకర్ మాట్లాడుతూ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మాదాసుగంగాధరం మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు, కమిటీలు ఏకమై ప్రతి ఇంటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. అనంతరం మండలాల వారిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలతో సమీక్షించారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దేవిక చౌదరి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరి చేరుకున్న బైక్ యాత్ర


అమర్‌నాథ్‌రెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సువర్ణ పరిపాలనపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వైఎస్సార్ కడప జిల్లా వాసి అమర్‌నాథ్‌రెడ్డి చేపట్టిన 175 నియోజకవర్గాల బైక్ యాత్ర సోమవారం వెంకటగిరి చేరుకుంది. ఆయన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూకంగా కలిశారు. ఆయనను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో అమర్‌నాథ్‌రెడ్డి 175 నియోజకవర్గాల బైక్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేణులు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు గొల్లపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డిని సోమవారం రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. మనోజ్‌కుమార్‌రెడ్డి తండ్రి పాపారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మనోజ్‌కుమార్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాగు చేసుకుంటుంటే అడ్డుకుంటున్నారు


తహసీల్దార్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న బాధితురాలు రమణమ్మ

చిల్లకూరు : తన భర్త పేరుతో పట్టా ఇచ్చిన భూమిలో పంటలు సాగు చేసుకుందామని మొక్కలు నాటితే రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంటున్నారని తిమ్మనగారిపాళెంకు చెందిన జోగి రమణమ్మ వాపోయింది. ఆమె సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించింది. ఆమె మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 164లో 1.25 ఎకరాల భూమిని గతంలో తన భర్త జోగి రామసుబ్బయ్య పేరుతో డీ ఫాం పట్టాను ప్రభుత్వం ఇచ్చిందని తెలిపింది. దీన్ని గతంలో సాగు చేసుకునే వారమని, తన భర్త మృతి చెందడంతో రెండేళ్లుగా సాగు చేయలేదని పేర్కొంది. ఇప్పుడు జామాయిల్ మొక్కలు నాటుకునేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంటున్నారని తెలిపింది. తనకు న్యాయం చేయాలని కోరింది. పరిశీలించి సర్వేయర్ ద్వారా భూమిని కేటాయిస్తామని తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కావలి శ్రీనివాసులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కోట: విద్యానగర్ టీటీడీ రోడ్డు సమీపంలో సోమవారం కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

వైభవంగా పుష్పయాగం


పుష్పయాగంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి


పుష్పయాగాన్ని తిలకిస్తున్న డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, భక్తులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో ఉన్న టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. ముందుగా వివిధ రకాల పుష్పాలను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఆలయానికి తీసుకొచ్చారు. పుష్పపాన్పుపై స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను చేర్చి అర్చకులు పూజలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, శ్రీకాళహస్తీశ్వరాలయం పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, కందాటి శేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలివెళ్లిన నాయకులు


సమావేశానికి వెళుతున్న నాయకులు, కార్యకర్తలు

కలువాయి: వెంకటగిరి నేదురుమల్లి బంగ్లాలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. జెడ్పీటీసీ బి.అనీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలలో తరలి వెళ్లారు. ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బారామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎంఎల్‌సీ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు గంగాధరం సమావేశానికి హాజరయ్యారు.

స్వప్రయోజనాల కోసమే పొత్తు


ఎంపీపీ గోను రాజశేఖర్

దక్కిలి : టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రయోజనాలు కాకుండా స్వప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నారని ఎంపీపీ గోను రాజశేఖర్ విమర్శించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వనంటూ కేంద్ర హోమ్ మంత్రిపై రాళ్లు వేయించిన ఘన చరిత్ర చంద్రబాబుదన్నారు. రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ దేశ ప్రధానిని విమర్శించిన నిలకడలేని వ్యక్తిత్వం పవన్‌దని తెలిపారు. వీరికి ప్రజల సంక్షేమం అవసరం లేదన్నారు. అధికారం కోసం అనైతిక పొత్తులతో ముందుకు వస్తున్నారని తెలిపారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం తప్ప వీరికి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్టదన్నారు. ఎంత మంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండలేరు డ్యామ్ నుంచి గూడూరు పట్టణానికి సరఫరా అవుతున్న వాటర్ మెయిన్ పంపింగ్ లైన్‌కు సైదాపురం మండలం తురిమెర్ల వద్ద లీకేజీ ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంగళవారం తాగునీటి సరఫరా జరగదని, అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. లీకేజీని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి బుధవారం యధావిధిగా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు





గూడూరు పట్టణంలో పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు, చిల్లకూరు: పరీక్ష సెంటర్ వద్ద విద్యార్థులు, వెంకటగిరిలో పరీక్షలు రాస్తున్న పిల్లలు, నాయుడుపేటలో..

సైదాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సైదాపురం, కలిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 310 మంది పరీక్షలు రాశారు. అనంతమడుగు, చాగణం, మర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 200 విద్యార్థులు సైదాపురం పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కలిచేడు కేంద్రంలో ఊటుకూరు, గిద్దలూరు, తలుపూరులోని 110 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

రాపూరులో..

రాపూరు : మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. మొదటి రోజు రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 179 మందికి గాను 171 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 179 మందికి 174 మంది, కండలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 117 మందికి 114 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

ఓజిలి: మండలంలోని చిలమానుచేను, ఓజిలి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈవోలు శైలజ, చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో 320 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎస్‌ఐ రవిబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం : స్థానిక బీసీ గురుకుల, ఏకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మావిళ్లపాడు ఆదర్శపాఠశాల, డీవీ సత్రంలోని కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 432 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. ఎస్‌ఐ తిరుమలరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను నోటీసు బోర్డులో చూసుకునే క్రమంలో సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలో ఏర్పాటుచేసిన సెంటర్లలో 1,385 మంది పరీక్షలు రాసినట్టు అధికారులు తెలిపారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలో తొలిరోజు సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చిల్లకూరు, తిక్కవరం, వగరలిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. చిల్లకూరులో 200 మందిలో 26 మంది గైర్హాజరయ్యారు. తిక్కవరంలో 197 మందికి 24 మంది హాజరుకాలేదు. వగరలిలో 123 మందికి గాను 10 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో సనత్ కుమార్ తెలిపారు.

తడలో..

తడ: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వాటంబేడు ఉన్నత పాఠశాలకు సంబంధించిన 31 మంది విద్యార్థులకు సూళ్లూరుపేట పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. మొత్తం 383 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 78 మంది హాజరుకాలేదని ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు.

నాయుడుపేటలో...

నాయుడుపేట : పట్టణంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నారాయణ పాఠశాలలో 230 మందికి గాను 213 మంది రాశారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 253 మందికి గాను 242 మంది, బాలుర గురుకుల పాఠశాలలో 268 మందికి గాను 251 మంది, జెడ్పీ ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాలలో 207 మందికి గాను 197 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో తెలిపారు. సెయింట్ మేరీస్ పాఠశాలలో 185 మందికి గాను 169 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 216 మంది గాను 213 మంది పరీక్షలు రాశారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వెంకటగిరిలోని 7 పరీక్షా కేంద్రాల్లో 1,237 మందికి గాను 1,160 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

వాకాడులో..


వాకాడులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వాకాడు : మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వాకాడు గురుకులం పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో బాలిరెడ్డిపాళెం, వాలమేడు, దుగ్గరాజపట్నం, వాకాడు, వాకాడు గురుకుల పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. 187 మంది హాజరుకావాల్సి ఉండగా 158 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు.

దక్కిలిలో..

దక్కిలి : మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. దక్కిలి, డి.వడ్డిపల్లి, వడ్లమోపూరు, దగ్గవోలు, తీర్థంపాడు, కమ్మవారిపల్లి (పాతనాలపాడు), హైస్కూల్‌తో పాటు ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు సంబంధించి 270 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 254 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలో బాలాయపల్లి, జయంపు హైస్కూల్‌లో సోమవారం జరిగిన పదవ తరగతి పరీక్షలకు 220 మందికి గాను 208 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.




సైదాపురం: పరీక్ష సెంటర్‌లో విద్యార్థులు, రాపూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలకు పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు